www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 16 మార్చి 2023

5

వైఎస్ఆర్



కారుణ్య నియామక పత్రం అందజేత

ప్రజాశక్తి-కడప అర్బన్

ఇటీవల అనారోగ్యంతో మరణించిన హోంగార్డు వై.శ్రీనివాసులు (హెచ్‌జి 207) తనయుడు వై.వెంకటేష్‌కు కారుణ్య నియామకం కింద హోంగార్డుగా నియామక పత్రాన్ని ఎస్‌పి కెకెఎన్.అన్బురాజన్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందచేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. పోలీస్ శాఖ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీసుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి బి.రమణయ్య, ఆర్‌ఎస్‌ఐ శ్రీనివాసులు, దివంగత హోం గార్డు సతీమణి వై.రమాదేవి, హోంగార్డులు పాల్గొన్నారు.

కౌంటింగ్ నేడే!



అనంతపురంలో కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లు

- మండలి యోగం ఎవరికి దక్కేనో?
- బాక్సుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థుల భవితవ్యం
- మొదటి రోజే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితం
- జిల్లాలో సర్వత్రా ఉత్కంఠ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధమైంది. అనంతపురం జిల్లా అధికార యంత్రాంగం గురువారం అన్ని ఏర్పాట్లూ చేసింది. ఈ నెల 13న ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని 212 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే. కడప జిల్లాలో 93 పట్టభద్ర పోలింగ్ కేంద్రాలు, 38 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నడిచింది. కడప జిల్లాకు చెందిన ఐదుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవడంతో పోలింగ్‌కు అనూహ్య స్పందన లభించింది. కడప జిల్లాలో 72.01 శాతం పట్టభద్రులు, 91.31 శాతం ఉపాధ్యాయులు, అన్నమయ్య జిల్లాలో 68.31 శాతం పట్టభద్రులు, 93.36 శాతం ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడం గమనార్హం. పోలింగ్ అనంతరం ఎన్నికల బరిలో నిలిచిన 49 మంది పట్టభద్ర, 12 మంది ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. కడప జిల్లాకు చెందిన కత్తి నరసింహారెడ్డి, ఎ.రామచంద్రారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అనిల్‌రెడ్డి, పట్టుపోగుల పవన్‌తో కలిసి ఐదుగురు బరిలో దిగిన నేపథ్యంలో ఫలితంపై జిల్లా వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. కౌంటింగ్ మొదలైన రోజు నుంచి మరుసటి రోజు ఉదయానికి ఎవరిని ఎమ్మెల్సీ యోగం పట్టనుందో తేలిపోయే అవకాశం ఉంది. మొదటి రోజు సాయంత్రానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, మరుసటి రోజు ఉదయానికి పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం తేలనున్నట్లు తెలుస్తోంది. కౌంటింగ్ రోజు సాయంత్రానికి పట్టభద్ర ఓట్ల లెక్కింపు మొదటి రౌండ్ లెక్కింపు ముగిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మొదటి రౌండ్‌లో పూర్తి మెజార్టీ లభించని అనంతరం రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. మొదటిరోజు అర్ధరాత్రి సమయానికి కట్టలు ఎవరికి ఏమేరకు వచ్చాయనే అంశంపై చూచాయగా స్పష్టత లభించనున్నట్లు తెలుస్తోంది.

రాములోరి కల్యాణోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు : జెసి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఏప్రిల్ 5న జరిగే శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఒంటిమిట్టలో రాములోరి కల్యాణోత్సవం నిర్వహణకు సంబంధించి కల్యాణోత్సవం వేదిక, శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై కడప మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్‌తో కలసి క్షేత్రస్థాయిలో జెసి సాయికాంత్ వర్మ పరిశీలించి తగు సూచనలను జారీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నుండి ఏప్రిల్ 9వ తేదీ వరకు శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయన్నారు. ఏప్రిల్ 5వ తేదీన జరిగే సీతారాములవారి కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే అవకాశం ఉన్నందున పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ప్రముఖులు, అత్యంత ప్రముఖులు రావచ్చనే అంచనాతో ప్రణాళికాబద్ధంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కళ్యాణోత్సవానికి సంబంధించి ఆలయం నుండి కల్యాణ వేదిక వరకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక, కనీస వసతులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు. భద్రతా ఏర్పాట్లు, శానిటేషన్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, తాగునీరు, భక్తులకు అన్నప్రసాదాలు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ కంట్రోల్, ఆర్టీసీ రవాణా సౌకర్యం, సూచిక బోర్డులు ఏర్పాటు, కంట్రోల్ రూం ఏర్పాటు, సీసీ కెమెరాలు, విద్యుత్, అగ్నిమాపక వాహనాలు, 108 వాహనాలు, అత్యవసర మందులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, తాత్కాలిక మెడికల్ క్యాంపులు, అక్కడక్కడ హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జెసి సాయికాంత్ వర్మ కోదండరామస్వామి వారి ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించి స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ, ప్రసాదాలు అందించి వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు ధర్మచంద్రారెడ్డి, వెంకటరమణ, డ్వామా, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు యదుభూషన్‌రెడ్డి, ఆనంద్ నాయక్, రామమోహన్‌రెడ్డి, డిఎస్‌పి శివారెడ్డి, సమగ్ర శిక్ష ఎపిసి ప్రభాకర్ రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, డిపిఒ ప్రభాకర్‌రెడ్డి, జెడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాస్ రెడ్డి, డిటిసి మీరాప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం ప్రసాద్ రెడ్డి, సమాచార శాఖ ఎడి వేణుగోపాల్‌రెడ్డి, తితిదే సివిల్ విభాగం ఇఇ సుమతి, డిఇ రామమూర్తి, విద్యుత్తు విభాగం డిఇ చంద్రశేఖర్, డిప్యూటీ ఇఒ నటేష్ బాబు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి సాయి కాంత్‌వర్మ

రాష్ట్రంలో రాక్షస పాలన

పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్రంలో రాక్షస ప్రభుత్వం రాజ్యమేలుతోందని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా ఎస్సీలపై దాడులు పెరిగాయాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 43వ రోజుకు చేరుకుంది. బుధ వారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియో జకవర్గం బి.కొత్తకోట మండలంలోని గుట్టపాలెం నుంచి ప్రారంభమైన పాదయాత్ర గట్టు, కొండకిందపల్లి, బుచ్చిరెడ్డిపల్లి, ఇందిరమ్మకాలనీ విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగుగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, ఎస్‌సి సామాజిక వర్గీయులు, ముస్లింములు, టమోటా రైతులు, బి.కొత్తకోట వాసులతో మాటామంతి, ముఖా ముఖి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడుతూ కరోనా సమయంలో మాస్కు అడిగినందుకు విశాఖపట్నంలో దళిత డాక్టర్ సుధాకర్‌ను అన్యాయంగా హింసించి పొట్టనబెట్టుకున్నారని తెలిపారు. తూర్పు గోదావరిలో వైసిపి నేతల ఇసుక అక్రమాలను వరప్రసాద్‌కు శిరో ముండనం చేశారన్నారు. చిత్తూరులో మద్యం మాఫియాని ప్రశ్నించిని ఓంప్రతాప్‌ని హతమార్చారని చెప్పారు. రాష్ట్రంలో దళితులకు రక్షణ లేదు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన 12 వేల ఎకరాల భూములను లాక్కొన్న దళిత ద్రోహి జగన్ అని విమర్శించారు. దళితు లకు చెందాల్సిన రూ.వేల కోట్ల సబ్ ప్లాన్ నిధు లను దారిమళ్లించి తీరని అన్యాయం చేశారని తెలిపారు. దళితుల అభివృద్ధి, సామాజిక న్యాయానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటా యించి స్వయం ఉపాధికి కృషి చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీల కోసం గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ పునరుద్దరిస్తామని హామీ ఇచ్చారు. మైనార్టీల్లో పేదరికం లేకుండా చేయడమే టిడిపి లక్ష్యమన్నారు. తంబళ్లపల్లెలో తాలిబాన్ పాలన నడుస్తుందని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక ఉర్దూ టీచర్ల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. 2025 జనవరి 1న జాబ్ కేలండర్ విడుదల చేస్తామని, .అందులో ఉర్దూ టీచర్ల పోస్టులు కూడా ఉంటా యని తెలిపారు. ఏపీలో ఎప్పుడూ లేనంతగా మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. దాడులు చేసిన ఎవర్నీ వదలమన్నారు. ముస్లిం రిజర్వేషన్ల కోసం టిడిపి పోరాడు తోందని తెలిపారు. చిన్నాన్నను చంపిన వ్యక్తి తరపున ప్రభుత్వ లాయర్లను పెడుతున్నారు. కానీ ముస్లిం రిజర్వేషన్ల కోసం మాత్రం ఈ సిఎం పోరాడటం లేదని పేర్కొన్నారు. దుల్హన్ కింద రూ.50 వేలు మేము ఇచ్చాం..కానీ జగన్ రూ.లక్ష ఇస్తామని మోసం చేశారన్నారు. మదన పల్లిని జిల్లా కేంద్రం చేస్తామని, ముస్లింలకు రెసిడెన్షియల్ కాలేజీలు కూడా ఏర్పాటు చేస్తామ న్నారు. కుప్పంనకు పరిశ్రమలు వచ్చాయి..కానీ తంబళ్లపల్లెకి రాలేదని, దీనికి కారణం పాపాల పెద్దిరెడ్డి కుటుం బమేనని విమర్శించారు. పరిశ్ర మలు పెట్టాలంటే వాటా ఎంతిస్తారని అడుగు తున్నారన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఓడించ కపోతే నియోజకవర్గ ప్రజలు పేదరికంతోనే జీవించాల్సి వస్తుందని తెలిపారు. రైతు ఆత్మహత్యల్లో దేశంలో ఎపి మూడవ స్థానంలో ఉందన్నారు. ఎన్నికల ముందు గుర్తొచ్చిన టమోటా రైతులు, అధికారంలోకి వచ్చాక కనిపిం చకపోవడం దారుణమన్నారు. ఆసియాలోనే అతిపెద్ద టమోటా మార్కెట్ మదనపల్లిలో ఉందన్నారు. టమోటా రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కోల్డ్ స్టోరేజీలు పెట్టి ధరలు పెరిగే వరకు అందులో నిల్వ ఉంచుకోగలిగితే రైతుకు ఉపయోగంగా ఉంటుందన్నారు. కోల్డ్ స్టోరేజీలు నిర్మించడలో ప్రభుత్వం విఫలమైం దన్నారు. తాము అధికా రంలోకి వచ్చాక టమోటా పల్పింగ్ యూనిట్ పెడతామన్నారు. మదనపల్లి టమోటా మార్కెట్ బాధ్యతలను లోకేష్ తీసుకుంటాడని హామీ ఇస్తున్నానని పేర్కొన్నారు. మోటార్లకు మీటర్లు పెట్టాలనే ఆలోచనను టిడిపి ప్రభుత్వం ఏనాడూ చేయలేదన్నారు. పాదయాత్రలో మాజీ జడ్జి రామకృష్ణ పాల్గొని సంఘీభావం తెలియజేశారు.



నారా లోకేష్ పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న మాజీ జడ్జి రామకృష్ణ

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- వినియోగదారుల ఫోరమ్ సభ్యులు మురళీకృష్ణ

ప్రజాశక్తి - కడప

వినియోగదారుల చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని వ్యాపారంలో జరుగుతున్న మోసాలను అరికట్టాలని జిల్లా వినియోగదారుల ఫోరమ్ సభ్యులు మురళీకృష్ణ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని విసి హాలులో వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌర సరఫరాల శాఖ, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం వారి ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రపంచ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఉపయోగించే ప్రతి ఒక్క వస్తువుపైన చట్టపరమైన హక్కును ప్రభుత్వం కల్పించిందన్నారు. చాలామంది చట్టాలపై అవగాహన వున్నా ఆచరణలో పెట్టకపో వడం వల్ల చాలా వరకు మోసపోతున్నారని, ఇది కేవలం వినియోగదారుడి నిర్లక్ష్యం వల్లే అన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యాపారస్థునికీ వినియోగదారుడే దేవుడని తెలిపారు. ప్రతి ఒక్క సేవలోను ఏదోరకంగా మోసం అనేది జరుగుతుందన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అర్జునరావ్ మాట్లాడుతూ ఎంతో మోజుతో కొన్న వస్తువు నాణ్యతను కోల్పోతే వినియోగదారుల క్షోభ వర్ణనాతీతమన్నారు. డిఎంహెచ్ఒ నాగరాజు మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ వ్యాపారి వద్ద ఏదోక వస్తువు కొనాల్సిన అవసరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల ఫోరం కన్వీనర్ తిరుపాలు, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ సిపి రమేష్, ఫోరమ్ ప్రతినిధి ఓబులేసు పాల్గొన్నారు. **కడప :** వినియోగదారుడు మార్కెట్లో ఏవైనా వస్తువులు కొన్నప్పుడు వాటిని వినియోగించేటప్పుడు ఏవైనా లోటుపాట్లు కనిపిస్తే ఆ వస్తువును లేదా సేవను అందించిన సంస్థను ప్రశ్నించే హక్కు వినియోగదారుడికి ఉంటుందని స్టెప్ సిఇఒ సి.సాయి గ్రేస్ తెలిపారు. స్టెప్ ఆధ్వర్యంలో బుధవారం కడప నగరం అలంకార్‌పల్లిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లీగల్ మెట్రోలోజీ ఇన్‌స్పెక్టర్ ఎం.వి.రమేశ్‌కుమార్‌రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కె.ఎస్.ఫర్హతుల్లా పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మ్యూజికల్ చైర్స్, టగ్ అఫ్ వార్ క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.నిత్యప్రభాకర్, స్టెప్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర, అర్థశాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ నరేష్ అధ్యక్షతన కామర్స్ అధ్యాపకులు శ్రీనివాసులు పర్యవేక్షణలో అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కశాశాల అధ్యాపకులు సులోచన, గురమ్మ, యంబడి ఈశ్వరయ్య, నరసింహారెడ్డి, రవిచంద్ర, చైతన్య అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశల పద్దు!



- ఆర్థిక మంత్రి 'బుగ్గన'పైనే భరోసా
- కదలని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు
- సా..గుతున్న సూపర్‌స్పెషాలిటీ పనులు
- ఎత్తిపోతల పనులకు మోక్షమెప్పుడో?!

ప్రజాశక్తి - కడపప్రతినిధి

రాష్ట్ర బడ్జెట్-2023-24 సమర్పణకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ప్రవేశపెట్టనున్నారు. జిల్లా ప్రగతి చోదకశక్తులైన సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్న సంగతి తెలిసిందే. ఏడాదిన్నరగా పారిశ్రామికానికి మౌలిక వసతుల కల్పనలో కదలిక వచ్చినప్పటికీ పరిశ్రమల ఏర్పాటు నానాటికీ ఆలస్యమవుతోంది. 2024 ఏప్రిల్, మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఇదే పూరిస్థాయి బడ్జెట్ అవుతుందని చెప్పవచ్చు. జిల్లా ఇరిగేషన్ ఇంజినీరింగ్ యంత్రాంగం ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు గతేడాది తరహాలోనే సుమారు రూ.5022 కోట్ల కేటాయించాలని కోరుతూ ప్రతిపాదనలు అందజేసింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 ప్యాకేజీ పనులు, కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతలు, రాజోలు, జొలదరాశి, యురేనియం బాధిత గ్రామాలకు తాగునీటి సరఫరా ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో కేటాయింపులు చేయాల్సి ఉంది. పాదయాత్ర సందర్భంగా వైఎస్ జగన్ ఇచ్చిన హామీ ప్రకారం మూడేళ్లలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణం, జిజిహెచ్ (రిమ్స్)లో సూపర్ స్పెషాలిటీ సేవల పనులను సకాలంలో పూర్తి చేస్తామని హామీల అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ప్రారంభిస్తామనే గడువు ముగిస్తున్నప్ప టికీ శంకుస్థాపనల దశలోనే కొట్టు మిట్టా డుతోంది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కాంట్రాక్టుల రివర్స్ టెండరింగ్ పేరుతో ఎటు వంటి పురోగతీ లేకుండా పోయింది. ఇటీవల జిఎన్ఎస్ఎస్ ప్యాకేజీ -1, ప్యాకేజీ-2 ప్యాకేజీ-3 పనులకు టెండర్లు నిర్వహించడం మినహా మిగిలిన ప్యాకేజీ-4, ప్యాకేజీ-5, ప్యాకేజీ-6, ప్యాకేజీ-7 పనుల్లో ఎటువంటి పురోగతి లేకుండా పోయింది. రూ.1357 కోట్లతో రాజోలి, రూ.1312 కోట్లతో జొలదరాశి, రూ.564 కోట్లతో కుందూ-పెన్నా ఎత్తిపోతల, రూ.5000 కోట్లతో కాలేటివాగు ఎత్తిపోతల పథకం పనులకు భూసేకరణ, అడ్డంకుల కార ణంగా ముందుకు సాగడం లేదు. ఇదేతరహాలో రూ.272.81 కోట్లతో జిజిహెచ్ (రిమ్స్‌లో) సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పనుల్లో ఆశించిన పురోగతి కనిపిం చడం లేదు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని యురేనియం బాధిత గ్రామా లకు తాగు నీటి పైప్‌లైన్ పనులు సాకారానికి నోచుకోలేదు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనల సందర్భంగా ఆయా పనుల పురోగతిని ఏకరువు పెట్టడానికి ప్రాధా న్యత ఇవ్వడం తెలిసిందే. జిల్లావ్యాప్తంగా గండికోట, సోమశిల, పైడిపాలెం నిర్వాసితుల సంగతిని పట్టించుకోవడం లేదు. గండికోట నిర్వాసితులకు పెంచిన పరిహారం ఎప్పటికి అందుతుందో తెలియడం లేదు. ఇదేతరహాలో తెలుగుగంగ, చిత్రావతి, సర్వరాయసాగర్ రిజర్వాయర్ల లీకేజీ పనులు దశాబ్దాల తరబడి నిరీక్షి స్తుండడం తెలిసిందే. ఈనేపథ్యంలో తెలుగుగంగ ఇంజనీరింగ్ యంత్రాంగం తాజాగా రూ.125 కోట్ల మేరకు ప్రతిపాదనలు పంపించింది. ఇందులో జిఎన్ ఎస్ఎస్ ఫేజ్-2, టిజిపి ప్రతిపాదనల్లో ఏమేరకు కేటాయింపులు ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఇద్దరు డీబార్, 987 మంది గైర్హాజర్

ప్రజాశక్తి - కడప అర్బన్/రాయచోటి

ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా 92 పరీక్షా కేంద్రాల్లో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, ఒకేషనల్ సబ్జెక్టు పరీక్షలు జరిగాయి. 22,413 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 21,426 మంది హాజరయ్యారు. 987 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు సిసి కెమెరాల నిఘాలో నిర్వహించారు. పటిష్టభద్రతా ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలన్నిటిని ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా ఆర్ఐఒ కార్యాలయంలో, విజయవాడ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల అధికారులకు ఆర్ఐఒ రమణరాజు తగిన సూచనలు చేశారు. రాష్ట్ర పరిశీలకులుగా రవిశంకర్ నాయక్ పర్యవేక్షించారు. నాలుగు జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు కూడా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆర్ఐఒ కార్యాలయం నుంచి ఆర్‌జెడి ఆన్‌లైన్ స్ట్రీవింగ్ ద్వారా పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అవకతవకులు జరగకుండా పర్యవేక్షిస్తూ పరీక్ష కేంద్రాలలోని అధికారులకు సూచనలు చేశారు. స్క్వాడ్ బృందాలు పులివెందుల పరీక్ష కేంద్రంలో ఒకరిని, రాయచోటి పరీక్ష కేంద్రంలో ఒకరిని మాల్ ప్రాక్టీస్ కింద డీబార్ చేశారు. పరీక్ష కేంద్రా వద్ద 144 సెక్షన్ విధించారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. కలెక్టరేట్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేశారు.



పీలేరు : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ నిధుల వినియోగంపై పిఒలకు శిక్షణ

ప్రజాశక్తి-కడప అర్బన్

జాతీయ సేవ పథకం నిధుల వినియోగంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎన్.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని జాతీయ సేవ పథకం ప్రోగ్రాం ఆఫీషర్ల కు పబ్లిక్ ఫైనాన్సియల్ మేనేజిమెంటు సిస్టం (పి.ఎఫ్.ఎం.ఎస్) గురించి ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విసి ఆచార్య రంగ జనార్ధన్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య కృష్ణారెడ్డి సహకారంతో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఎన్ఎస్ఎస్ నిధులన్నీ ఆన్లైన్ విధానంలో పీవో లు ఖర్చు చెస్తారని పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగం అనేది ఉండదని చెప్పారు. రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారులు నిధుల మానిటరింగ్ నేరుగా చేయవచ్చన్నారు. విజయవాడ జాతీయ సేవా పథకం రాష్ట్ర కార్యాలయ రిసోర్స్ పర్సన్ దూపూడి మనోహరి, పి.శివకాంత్ పబ్లిక్ ఫైనాన్స్ సెల్ మేనేజ్మెంట్ సిస్టం గురించి పి.పి. టి ద్వారా అవగాహన కల్పించారు. పిఒలకు సందేహ నివ ృత్తి చేశారు. శిక్షణా తరగతులలో విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని కళాశాలల ఎన్ఎస్ఎస్ పిఒలు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రయోగాలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని ఇబ్రహీం ఖలీలుల్లా మస్జీద్ దగ్గర ఉన్న హజరత్ బిలాల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, హెచ్‌బి.మోడల్ స్కూల్ కరస్పాండెంట్ షేక్.మొహమ్మద్ నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైసిపి నాయకులు అహ్మద్ బాషా, రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, నాయకులు డాక్టర్ సుహేల్ అహ్మద్, మైనార్టీ ప్రముఖులు జిలాన్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లలో పాల్గొని తమ మేధో శక్తిని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు అబ్బురపరిచే విధంగా తమ ప్రతిభతో ఉత్తమ ప్రయోగాలు చేయడం ప్రశంసనీయమన్నారు. ప్రత్యేకంగా రైతుల సేవల గురించి కూడా అద్భుతంగా ప్రాజెక్టులను తయారు చేసినందుకు అభినందించారు. రక్తదాన శిబిరం నిర్వహించడం హర్షనీయమన్నారు. రక్తదానం చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు, వివిధ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

17న వైవీయూలో మొల్ల సప్తశత జయంతి సభ

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం, మొల్ల సాహితీపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన కవయిత్రి మొల్ల సప్తశత జయంతి సభ వైవీయూ ప్రాంగణంలోని ఆర్ట్స్ బ్లాక్ సెమినార్ హాల్లో నిర్వహించనున్నట్లు తెలుగు శాఖ అధిపతి ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభకు ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ విసి ఆచార్య జింక రంగజనార్ధన, గౌరవ అతిథులుగా ప్రిన్సిపల్ ఆచార్యులు ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, వైవీయూ మానవీయ శాస్త్రాల పీఠం డీన్ ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథులుగా పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింక సుబ్రహ్మణ్యం, అవధాని మాడుగుల శివశ్రీ శర్మ, మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపకులు డాక్టర్ గానుగపెంట హనుమంతరావు హాజరవుతారని తెలిపారు. ప్రధాన వక్తగా తిరుపతికి చెందిన శతావధాని, డాక్టర్ ఆముదాల మురళి, హాజరవుతారని పేర్కొన్నారు.

పశుసంవర్ధక శాఖ డిడి అదృశ్యం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుమారుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

పశుసంవర్ధక శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అచ్చన్న ఈ నెల 12వ తేదీ నుంచి కనిపించకుండా పోయారని ఆయన కుమారుడు క్లింటన్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ 8 నెలలుగా పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న కొంత మంది సిబ్బందికి, మా తండ్రికి శాఖా పరమైన సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. తీవ్ర మనస్థాపానికి గురైన నా తండ్రి ఎవరికీ చెప్పకుండా కనిపించకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. పోలీస్ అధికారులు జోక్యం చేసుకొని తన తండ్రి ఆచూకీ తెలియజేయాలని కోరారు.



డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చన్న

17న కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

కడప అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఈ నెల 17న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. కాంట్రాక్ట్, అవుట సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి అమలు చేయడం విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్ స్కిల్డ్ వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ రూ.ఆరు వేలు ఇచ్చి ఇంజినీరింగ్ కార్మికులకు పోవడం సమంజసం కాదని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ ను జీతాల్లో కలిపి ఇవ్వాలని కోరారు. ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు పనిముట్లు అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు నాగేంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, కోశాధికారి గోపి పాల్గొన్నారు.

హోటల్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప హోటల్, ఫుడ్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం మానస ఇన్ హోటల్లో యాజమాన్యాలు కలిసి ఎన్నుకున్నాయి. అధ్యక్షులుగా రషీద్ ఖాన్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, షఫీ, కార్యదర్శిగా నవీన్, కోశాధికారిగా కిరణ్, సంతోష్, సంయుక్త కార్యదర్శిగా ఫరూక్, రెడ్డి బాబు, ఇసి మెంబర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి మాట్లాడుతూ ఎపి హోటల్స్ అసోసియేషన్ విజయ వాడ వారితో ఈ అసోసియేషన్ అనుసంధానమై ఉందని పేర్కొన్నారు. రంజాన్ మాసంలో రాత్రి 12 గంటలకు హోటల్స్ ఉండేలా అనుమతి ఇవ్వాలని కోరారు. సమావేశంలో వివిధ హోటల్స్ యాజ మాన్యాలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, నవీన్, సాయి, కిరణ్ కుమార్, నవీన్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కడప: పులివెందులలోని ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ, శిక్షణ ఉత్పత్తి కేంద్రంలో మొబైల్ ఫోన్ రిపేరు, ఎల్ఇడి బల్బుల రిపేరు కోర్సులో మూడు నెలల పాటు అర్హులు ఆసక్తి గల విభిన్న ప్రతిభావంతులు నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సంస్థ సహాయ సంచాలకులు ఆర్.వి.కృష్ణకిషోర్ తెలిపారు. 18-35 సంవత్సరాలలోపు వయసు కలిగి, పదవ తరగతి పాసై శారీరక విభిన్న ప్రతిభావంతులు, మూగ, చెవిటి విభిన్న ప్రతిభావంతులు ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి అర్హత కలిగిన వారు ఈ నెల 31వ తేదీ లోపు అమ్మ బయోడేటాతో పాటు తగిన ధ్రువపత్రాలు, పాస్పోర్ట్ ఫోటోలు జత చేసి కొత్త కలెక్టరేట్లోని డి-బ్లాక్‌లో కార్యాలయంలో అందజేయాలన్నారు.



రక్తదాతను అభినందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

యువకుడి రక్తదానం

ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్

మారతమ్మ అనే మహిళకు రక్తం అవసరమై కాగా స్థానిక అంజి అనే యువకుడు ఒ పాజిటివ్ రక్తాన్నిచ్చారు. మారతమ్మ ఆపరేషన్ నిమిత్తం పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరగా.. ఆమెకు ఒ పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు సూచించారు. ఆ మేరకు రోగి బంధువులు లైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్ రసూల్ అంజి అనే యువకుడిచే రక్తం ఇప్పించారు. అనంతరం ట్రస్ట్ నిర్వాహకులు అభినందించారు. ఎవరికైనా అత్యవసరంగా రక్తం కావాలనుకుంటే 81259 91900, 91829 90214 వాట్సాప్ నంబర్‌కు సమాచారమివ్వాలని వారు సూచించారు. కార్యక్రమంలో లైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రసాద్, ట్రస్ట్ సభ్యుడు అఖిల్, పాల్గొన్నారు.

8న షహమీరియా దర్గా ఉరుసు

ప్రజాశక్తి - కడప అర్బన్



నగరంలోని రవీంద్రనగర్‌లో వెలసి ఉన్న చారిత్రాత్మకమైన ఆస్థాన ఏ షహమీరియా దర్గా ఉరుసు ఉత్సవాలను ఈనెల 18నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దర్గాలోని హజరత్ ఖాజా సయ్యద్ షా అబ్దుల్ హక్ (ర.అ.)(ఉరఫ్) షహమీర్ బాషా సాహెబ్ ఖిబ్లా(ర.అ) చిష్తిఫుల్ ఖాదిరి సాహెబ్ ఉరుసు ఉత్సవాలను ఈ నెల 18న సాయంత్రం నిర్వహిస్తామన్నారు. అసర్ నమాజు తర్వాత గంధంతో ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. అలాగే నాతియా మెహఫిల్ జరుగుతుందన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు నిర్వహిస్తున్నట్లు ఆస్థాన యే షహమీరియా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా హుసేనిపాషా షహమీరి సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. 19న ఆదివారం సెమినార్ కార్యక్రమం వైఎస్ హౌస్ ఫంక్షన్ హాల్‌లో ఉంటుందన్నారు. ముఖ్యఅతిథులుగా కర్నూలు ఉర్దూ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్స్‌లర్ మౌలానా రాహి ఫిదాయి, ప్రొఫెసర్ ముజఫర్ షహమీరి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఫజులుల్లా ముకర్రం, ఎస్‌వి యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్తార్ సాహెర్, ప్రొఫెసర్ నిస్సార్ అహ్మద్ పాల్గొంటున్నారని తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

సక్రమంగా లేని భోజనం : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం సక్రమంగా లేక వారు అవస్థలు పడుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్ తెలిపారు. వారం రోజులుగా భోజనం సరిగాలేదని తల్లిదండ్రులు తమ దృష్టికి తెచ్చారన్నారు. ఆ మేరకు బుధవారం విలేకరులతో కలిసి పరిశీలించామన్నారు. దీనిపై ఎస్ఒను అడగ్గా.. ఒకటో తేదీ నుండి రేషన్ బియ్యం సరిగ్గా రాలేదని, రోజు ఇలాగే పెడుతున్నామని అనడం బాధాకరమన్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించగా ముద్దలు, ముద్దలుగా ఉందన్నారు. 320 మంది విద్యార్థులుండగా 120 గుడ్లు మాత్రమే ఉడికించారని తెలిపారు. తాము ప్రశ్నించగా మిగతా గుడ్లు ఇప్పుడే తీసుకొచ్చి ఉడికించారని తెలిపారు. అధికారులు దీనిపై స్పందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు కలివేల రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్



సంఘటనా స్థలంలో పోలీసులు, స్థానికులు, మృతుడు వలి

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రానికి సమీపంలోని నక్కలదిన్నె రోడ్డులో ఉన్న గుండ్లకమ్మ వంక వద్ద చేపలు పడుతూ వంకలోకి దిగి షేక్ వలీ (30) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రొద్దుటూరు కోనేటి కాలువ వీధికి చెందిన ఇద్దరు యువకులు బుధవారం చేపలు పట్టేందుకు వంక వద్దకు వచ్చారు. చేపలు పట్టే క్రమంలో వలి వంకలోకి దిగి మునిగిపోయాడు. వలితో పాటు వచ్చిన యువకుడు గుర్తించి స్థానికుల సాయంతో కాపాడే ప్రయత్నం చేశాడు. అప్పటికే వలి మృతి చెందినట్లు గుర్తించారు. స్థానికులు మృతదేహాన్ని వెలికి తీశారు. ఎస్ఐ కెసి రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వల్లికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సంఘటన గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆరుగురు ఎర్రచందనం దొంగలు అరెస్టు

- 19 దుంగలు స్వాధీనం : డిఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

నందిమండలానికి చెందిన ఆరుగురు ఎర్రచందన దొంగలను అరెస్టు చేసి, వారి నుంచి 19 ఎర్రచందన దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి వెంకటశివారెడ్డి తెలిపారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలం నందిమండలానికి చెందిన అల్లు సుధాకర్, కోట శ్రీనివాసులు, షేక్ హుస్సేన్‌పీరా, పబ్బతి ఓబులేసు, ఖాజీపేట పూసలకొట్టలకు చెందిన మోటు శ్రీనివాసులు, బాల్నేని గంగయ్యను పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. వీరి నుంచి రెండు గొడ్డళ్లు, రెండు మోటర్ సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్లు, నాలుగు రాళ్లు స్వాధీనం చేసుకున్నారని వివరించారు. కడప రూరల్ సిఐ కె.అశోక్‌రెడ్డి, పెండ్లిమర్రి ఎస్ఐ ఎన్.రాజరాజేశ్వర్‌రెడ్డి వారి సిబ్బందితో ఈ నెల 14న నందిమండలం దక్షిణ దిశలో ఏడు కిలోమీటర్ల వద్ద ఉన్న బావికోన కొండ దగ్గర వీరిని అరెస్టు చేశారమన్నారు. వీరు ఎర్రచందనం దుంగలను భుజాన వేసుకుని తరలిస్తుండగా దాడి చేయగా, దొంగలు పోలీసులపైనే గొడ్డళ్లు, రాళ్లతో దాడికి పాల్పడ్డారని తెలిపారు. పోలీసులు చాకచక్యంగా తప్పించుకుని వీరిని అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈ కేసులో మిగతా నిందితుల కోసం ప్రత్యేకబృందాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన వివరించారు. ఈ సందర్భంగా సిఐ అశోక్‌రెడ్డిని, ఎస్ఐ ఎన్.రాజరాజేశ్వర్‌రెడ్డిని, ఎఎస్ఐ, కానిస్టేబుళ్లను డిఎస్‌పి అభినందించారు.



అరెస్టయిన ఎర్రచందనం దొంగలతో డిఎస్‌పి, సిబ్బంది

ఈ రోడ్డుకు మోక్షమెన్నడో..!

- పదేళ్లుగా అసంపూర్తి రోడ్డుతో పలు గ్రామాల ప్రజలకు ఇక్కట్లు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వివి కోటాలు-వడియరాజుపేట గ్రామాల మధ్యలో అసంపూర్తిగా ఉన్న రోడ్డుకు మోక్షమెన్నడోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితం ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. వివి కొట్టాలు వద్ద రహదారి నిర్మాణంలో సమస్య ఏర్పడడంతో మధ్యలో ఆపేశారు. మిగిలిన ప్రాంతాన్ని పూర్తిగా రోడ్డు వేశారు. కేవలం 50 మీటర్ల పొడవు మాత్రమే అసంపూర్తిగా ఉంది. ఈ నేపథ్యంలో ఆ రోడ్డున వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. వర్షాకాలం పూర్తిగా ప్రయాణానికి వీల్లేకుండా ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డును బాగు చేయాలని వారు కోరుతున్నారు. ఈ మార్గాన వివి కొట్టాలు, వడియ రాజుపేట, సోమాపురం, శ్రీరామ్‌నగర్, ఎస్‌సి కాలనీ, సిద్ధారెడ్డిపల్లె, నాగాయపల్లి, మొర్రాయపల్లి గ్రామాల ప్రజలు మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రధాన రహదారి పైకి ప్రయాణిస్తుంటారు. ప్రజల సమస్యను దృష్టిలో పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డును పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



వివి కొట్టాలు వద్ద అసంపూర్తిగా ఉన్న రోడ్డు

డబ్బా కొట్టించుకోవడం శోచనీయం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

గవర్నర్ ప్రసంగం ద్వారా అరిగిపోయిన గ్రాంఫోన్ రికార్డులా వైసిపి ప్రభుత్వం నవరత్నాల డబ్బా కొట్టించుకోవడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో నవరత్నాలు నకిలీ రత్నాల్లా మారాయని ఎద్దేవా చేశారు. రైతు భరోసా పథకం రైతుల పట్ల నిరాశ పథకంలా తయారైందన్నారు. ప్రతి రైతుకు ఏడాదికి రూ.12,500 ఇస్తామని చెప్పి అందులో రూ,5,000 వేలు కోత పెట్టిందని చెప్పారు. రైతులు సాగు చేసే ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. పాడి రైతులకు లీటర్‌కు రూ.4 బోనస్ ఇస్తానని చెప్పి 4పైసలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఆరోగ్య శ్రీ పథకం అనారోగ్య శ్రీ పథకంగా మారిందన్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.750 కోట్లు పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. అమ్మఒడి డబ్బులు నాన్నా బుడ్డికి చాలడం లేదని విమర్శించారు. జగనన్న విద్యాదీవెన విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. 25 లక్షల ఇళ్లు కట్టిస్తామని చెప్పి, 25 వేల ఇళ్లు కూడా పూర్తి చేయలేదని తెలిపారు. అదికూడా పిచ్చుక ఇళ్లు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను నమ్మించి మోసగించిందని తెలిపారు. మద్యపాన నిషేధం మద్యపాన నిషా పథకంగా మారిందని విమర్శించారు. ఇప్పటికైనా నవరత్నాల డబ్బా కొట్టుకోవడం మానుకోవాలని ఎన్.తులసిరెడ్డి సూచించారు.

వెదురు ఉత్పత్తులకు మంచి ఆదరణ



వెదురు ఉత్పత్తుల గురించి శిక్షణనిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - ఖాజీపేట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేధించిన నేపథ్యంలో వెదురు ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తోందని ఎన్‌జిఒ అధ్యక్షులు తమ్మినేని రాఘవేంద్ర తెలిపారు. పదివేలకు పైగా ఉత్పత్తులు తయారు చేయగల సామర్థ్యం కేవలం వెదురుకు మాత్రమే ఉందన్నారు. మైదుకూరు పట్టణంలోని వాసవి పాఠశాల పక్కన బుధవారం ఎన్‌జిఒ ఆధ్వర్యంలో వెదురు మిషన్ మేదరి వృత్తిదారుల సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ వెదురుతో తయారయ్యే అందమైన బుట్టలు విశాఖపట్నంలో ఈనెల 28, 29న జరిగే జి-20 సదస్సుకు వెళ్తున్నాయన్నారు. ప్రపంచ దేశాల వారికి, రాజకీయ, ఉన్నతాధికారులకు ఆకర్షణగా నిలువ బోతున్నాయన్నారు. వెదురు రంగంపై ఆసక్తి ఉన్నవారు తమను సంప్రదించాలని సంస్థ కోశాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు టంగుటూరి మధు, మాస్టర్ ట్రైనర్ బసవరాజు, వెంకట నారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

కల్వర్టు ఏర్పాటు చేయరూ...!

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని వెదురూరు ఎస్‌సి కాలనీ వద్ద కెసి కెనాల్ కాలువపై కల్వర్టు ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. ఎస్‌సి కాలనీ నుండి రోడ్డుపైకి వచ్చేందుకు కెసి కెనాల్ కాలువ అడ్డుగా ఉందన్నారు. కాలువలో నీరు ప్రవహిస్తున్న సమయంలో రాతిదూలం ఏర్పాటు చేసుకుని కాలువ దాటుకుంటున్నామని తెలిపారు. వర్షాకాలంలో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని వేడుకుంటున్నారు. అలాగే గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, వర్షపు నీరు ప్రవహించే ఏర్పాట్లు లేకపోవడంతో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయని వాపోయారు. తమ కాలనీపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకశ్రద్ధ చూపాలని కోరుతున్నారు. గతేడాది నవంబర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ప్రస్తుతం వేసవిలో కల్వర్టు ఏర్పాటు చేస్తే, వర్షాకాలంలో ఇబ్బందులు ఉండవని ప్రజలు సూచిస్తున్నారు.



కల్వర్టు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం (ఫైల్ ఫొటో)

విద్యార్థులు పోటీతత్వంతో రాణించాలి



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఉపకులపతి రంగా జనార్ధన్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

నేటి సాంకేతిక రంగంలో విద్యార్థులు పోటీతత్వంతో రాణించాలని జెఎన్‌టియు ఉపకులపతి జి.రంగా జనార్ధన్ తెలిపారు. స్థానిక జెఎన్‌టియు కళాశాలలో బుధవారం టెక్ ఫెస్ట్-2కె23 కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.

ముఖ్య అతిథులుగా జి.రంగా జనార్ధన్ మాట్లాడుతూ నేటి సాంకేతిక రంగంలో సృజనాత్మకత, పోటీతత్వంతో ముందుకెళ్లాలన్నారు. మూడు రోజులు జరగబోయే ఈ టెక్ ఫెస్ట్-2కె23 కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంతో, సృజనాత్మకతతో, జ్ఞాన సముపార్జన చేయాలని ఆయన ఆకాక్షించారు. అనంతరం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర మాట్లాడుతూ, ఈ టెక్ ఫెస్ట్‌లో జరిగే కార్యక్రమాల ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. అన్ని విభాగాల్లో వర్క్ షాపులు, టెక్నికల్ ఈవెంట్స్, స్పాట్ ఈవెంట్స్ పేపర్ ప్రెజంటేషన్స్, పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రొఫెసర్ జి.రంగ జనార్ధన్ సిఎస్ఇ విభాగంలో ఐఒటి కిట్, రక్తదాన యాప్‌ను ఆవిష్కరించారు. ఎలక్ట్రికల్ విభాగంలో 'ఫాంటమ్ క్లబ్'ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, అన్ని విభాగాల అధిపతులు హాజరయ్యారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలకు 170 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షాకేంద్రం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు దీప పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు అధికారులు కల్పించారు.



పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ముద్దనూరు : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. స్థానిక శ్రీ వివేక వర్ధిని ఎయిడెడ్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో బుధవారం ముద్దనూరు, కొండాపురం మండలాల విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. పరీక్ష అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృతం పేపర్-1 పరీక్షకు 145 మంది విద్యార్థులకుగానూ 11 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. గురువారం రెండవ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం పేపర్-2 పరీక్ష ఉందన్నారు. 157 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. **పోరుమామిళ్ల టౌన్ :** ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో మొత్తం ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో 1251 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. బుధవారం తెలుగు, సంస్కృతం పేపర్లు రాశారు. కృష్ణ శారద జూనియర్ కళాశాలలో 219 మంది, ఒఎల్ఎఫ్ జూనియర్ కళాశాలలో 222, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 219, దత్తసాయి జూనియర్ కళాశాలలో 166, సాయిరాం కళాశాలలో 170, శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో 190 మంది విద్యార్థులకు పరీక్ష రాసేందుకు కేటాయించారు.

ఖాళీ స్థలాల్లో చెత్త వేయరాదు

కడప అర్బన్ : ప్రజలు చెత్తను రోడ్లు, కాలువలు, ఖాళీ స్థలాల్లో వేయకుండా అవగాహన కల్పించాలని కమిషనర్ జి.సూర్య సాయిప్రవీణ్ చంద్ అన్నారు. బుధవారం ఆయన శంకరాపురంలో పర్యటించి, పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన సమయానికి తప్పనిసరిగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ నరసింహారెడ్డి

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని, అలాంటి దుకాణాలను సీజ్ చేస్తామని కమలాపురం ఎడిఎ నరసింహారెడ్డి హెచ్చరించారు. స్థానిక పురుగుమందులు, ఎరువుల దుకాణాలను బుధవారం ఎడిఎ, ఎఒ నాగార్జున ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎడిఎ అమ్మకాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. దుకాణదారులకు పలు సూచనలు చేశారు. రైతులు కొనుగోలు చేసిన ఉత్పత్తులకు తప్పక బిల్లులు ఇవ్వాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు దుకాణాలను మూసేస్తామన్నారు.



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ షఫిఉన్నిషా బేగం

ఆడ, మగ బిడ్డలను సమానంగా చూడాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆడ, మగ బిడ్డలను సమానంగా చూడాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫిఉన్నిషా బేగం తెలిపారు. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గర్భిణులకు భేటీ బచావో.. భేటీ పడవోపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షఫిఉన్నిషా బేగం మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ అన్నారు. ఆడపిల్ల పుడితే వరకట్నం ఇవ్వాలనే భావన ఉండరాదన్నారు. కుటుంబ పెద్ద ఒత్తిడి వల్ల ఆడ పిల్లలు వివక్షకు గురవుతున్నారని తెలిపారు. ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మిగా భావించాలన్నారు. ఆడపిల్ల దేశ ప్రగతికి మనుగడ అన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వెంకటలక్ష్మి, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి రమేష్

రేపు ఇ-క్రాప్ నమోదు వివరాల ప్రదర్శన

ప్రజాశక్తి - లింగాల

మండలంలో ఇ క్రాప్ నమోదు వివరాలను ఈనెల 17న ప్రదర్శించనున్నట్లు ఎఒ రమేష్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆయన సామాజిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మురారి చింతల 2022-23 రబీ పంటల వివరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ క్రాప్ పంటల నమోదు పూర్తయిందన్నారు. 99 శాతం ఇకెవైసి పూర్తి చేశామన్నారు. సామాజిక తనిఖీ నిమిత్తం ఉంచిన పంట నమోదు జాబితాలో ఏమైనా అనుమానాలు ఉంటే రైతులు అభ్యంతరం తెలిపితే సరిచేస్తామన్నారు. కార్యక్రమంలో మురారి చింతల, లింగాల రైతు భరోసా కేంద్రం సిబ్బంది, విఆర్ఒలు పాల్గొన్నారు.

చక్రాయపేట : పంట నమోదులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లో ఫిర్యాదు చేయాలని మండల వ్యవసాయాధికారి నవంత్‌బాబు తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో రబీ 2022-23 పంట నమోదు జాబితా, సామాజిక తనిఖీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగులయ్య, వెంకటరమణ, హార్టికల్చర్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కేబుల్, మోటార్లు దగ్ధం



పొలం వద్ద బాధితులు

ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్

మండలంలోని కవలకుంట్ల గ్రామం దళితవాడకు చెందిన చాటకొండు రామయ్య పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు రేగి కేబుల్, రెండు మోటోర్లు కాలిపోయాయి. బాధితుల మేరకు వివరాలు.. రామయ్య తన పత్తి పొలానికి నీరు కట్టుకుంటూ ఉండగా ట్రాన్స్‌ఫార్మర్ నుండి పెద్దగా మంటలు లేచాయి. రామయ్య, తన భార్య భయంతో పొలం నుంచి బయటకు పరుగులు తీశారు. విషయాన్ని టేకూరుపేట సబ్‌స్టేషన్ అధికారులకు తెలిపారు. ఈ ప్రమాదంలో కేబుల్, మోటార్ల లోపలి భాగంతోపాటు కంచె కూడా కాలిపోయింది. అధికారులు నిర్లక్ష్యంతో పేద రైతుకు నష్టం జరిగిందనే ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారులు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.